క్లుప్తంగా

'ఇటికాల' కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



కాజీపేట అర్బన్: నాటి ఆర్ఈసీ నేటి నిట్ వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ ఇటికాల మధుసూదన్ రావు కాంస్య విగ్రహాన్ని నిట్ మెయిన్ గేట్ ఎదుట ఏర్పాటు చేయాలని నిట్ వర్కింగ్ ఎంప్లాయిస్, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు డిమాండ్ చేసారు. మధుసూదన్ రావు 107వ జయంతి సందర్భంగా యూనియన్ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్ పులి రవికుమార్, ఎంప్లాయిస్ రాంచందర్, వేణుగోపాల్, కుమారస్వామి, పోషయ్య పాల్గొన్నారు.

'మెపా' జిల్లా కమిటీ ఎన్నిక


రాజేష్, అధ్యక్షుడు


శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి

హన్మకొండ: హనుమకొండ ఎన్జీవోఎస్ కాలనీలోని కార్యాలయంలో ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా నూతన శనివారం కమిటీని ఎన్నుకున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ తెలిపారు. అధ్యక్షుడిగా పులి రాజేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా అమ్మగారి శ్యాంసుందర్, గౌరవ అధ్యక్షుడిగా పులి సదానందం, ఉపాధ్యక్షులుగా సిద్ద సుమన్, గోనెల విజేందర్, మట్టెపల్లి సాంబయ్య, కార్యదర్శులుగా వాసు శ్రీను, రోకుల సందీప్, కేశబోయిన కోటేశ్వరరావు, కోశాధికారిగా మట్టెపల్లి రణధీర్, కార్యవర్గ సభ్యులుగా కట్ల విజయ్, ఉడుతబోయిన క్రాంతికుమార్ ఎన్నికయ్యారని దేవేందర్ వెల్లడించారు.

ఐజేయూతోనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం

నయీంనగర్: ఐజేయూ అనుబంధ టీయూడబ్ల్యూజేతోనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అవుతాయని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో హనుమకొండ జిల్లా యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ముందుండి పోరాటం చేస్తున్న సంఘం టీయూడబ్ల్యూజే ఐజేయూ మాత్రమే అని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, ఉపాధ్యక్షుడు పి.విష్ణువర్ధన్ రెడ్డి, గజ్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిబ్బందికి చలువ కళ్లద్దాల పంపిణీ



దేశాయిపేట: మండుటెండల్లో రోజూ విధులు నిర్వహించే వరంగల్ ట్రాఫిక్ పోలీసులకు 100 చలువ కళ్లద్దాలను పంపిణీ చేసినట్లు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ డాక్టర్ ఆడెపు రవీందర్ తెలిపారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులకు పోచమ్మమైదాన్‌లో అద్దాలను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మట్టెవాడ ట్రాఫిక్ ఎస్సైలు, ట్రాఫిక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాతో మేలు

పరకాల : పరకాల చరిత్రలోనే ఒకే రోజు 2వేల మందికి ఉద్యోగాలు ఇప్పించిన ఘనత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికే దక్కుతుందని, 60 కంపెనీలతో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసి పరకాల ప్రాంతానికి చెందిన అనేక మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి అండగా నిలిచారని పరకాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ అన్నారు. మెగా జాబ్‌మేళా నిర్వహించినందుకు కృతజ్ఞతగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. వేలాది ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేస్తునే ఉద్యోగాలు రాని వారిని నిరుత్సాహపర్చకుండా జాబ్‌మేళా నిర్వహించడం గొప్ప విషయమన్నారు.

చెట్టును ఢీకొట్టిన ఆటో

కమలాపూర్ : గేదెను తప్పించబోయి ఆటో చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని గూనిపర్తి వద్ద శనివారం రాత్రి చోటు ఈ సంఘటన చోటుచేసుకుంది. నడికూడ మండలానికి చెందిన 108 ఈఎంటీ సంజీవ్, పైలట్ పున్నంచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమారంకు చెందిన బదనాపురం పవన్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి ఆటోలో పరకాల నుంచి భీమారం వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని గూనిపర్తి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఓ గేదెను తప్పించబోయి ఆటో రోడ్డు పక్కనేఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో ఆటోలో డ్రైవర్‌తో పాటు ఐదుగురు ప్రయాణిస్తుండగా పవన్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

కుల రహిత సమాజానికి, సామాజిక సమానత్వానికి, దళితుల ఆత్మగౌరవానికి కృషి చేసిన గొప్ప మహనీయుడు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని పలువురు కొనియాడారు. ఆయన జయంతి వేడుకలను నగర వ్యాప్తంగా శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్


ఎల్‌బీ కళాశాలలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, పక్కన మేయర్, కలెక్టర్


హనుమకొండలోని డీసీసీ భవన్‌లో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, డీసీసీ వరంగల్ అధ్యక్షురాలు స్వర్ణ


హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కొప్పుల ఈశ్వర్, వినయ్‌భాస్కర్, నాయకులు


జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్, పోలీస్ అధికారులు


టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతున్న సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి


దేశాయిపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


నిట్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు


నివాళులర్పిస్తున్న శాసనమండలి ఉప సభాపతి బండా ప్రకాశ్ ముదిరాజ్, తదితరులు


కేయూ సెనెట్ హాల్‌లో నివాళులర్పిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్, తదితరులు


ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నివాళులర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు


టీజీఎస్పీ బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణప్రసాద్, అధికారులు

రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్

● పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ: భారత రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం 57వ డివిజన్, హనుమకొండలోని గోకుల్‌నగర్, అశోక కాలనీ, గాంధీనగర్, రాంనగర్ మీదుగా శాంతినగర్ వరకు జరిగిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడాల్సిన, గౌరవించాల్సిన పాలకులు వాటిని నాశనం చేస్తున్నారని విమర్శించారు. అంబేడ్కర్‌ను అవమానిస్తూ, రాజ్యాంగాన్ని కించపరిచేలా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు బంక సతీష్ యాదవ్, కొండా నాగరాజు, పురెల్ల రవికిరణ్, తోట వెంకటేశ్వర్లు, మామిండ్ల రాజు, బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, ఎనుకంటి నాగరాజు, కేతిడి దీపక్ రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని

అభివృద్ధిలో వెనుకబడిన న్యూశాయంపేట

కాజీపేట అర్బన్: 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేట 15 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 15 నెలల్లో అభివృద్ధికి శ్రీకారం చుట్టామని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. న్యూశాయంపేటలో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలోనే న్యూశాయంపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, వేల్పుల మోహన్‌రావు, సురేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాగరాజుకు ఆహ్వానం



మడికొండ: మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరగనున్న సీతారాముల కల్యాణానికి రావాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును ఆయన నివాసంలో శనివారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పల్లపు అర్జున్, ధర్మకర్తలు హనుమకొండ మల్లికార్జున్, బిల్లా రాజ్‌కుమార్, మునిగాల రాము, మండల రఘు, జిట్ట హన్మంతరావు, దండిగం రమాదేవి, వలబోజు ఉపేందర్, గుగులోతు నాగేశ్వర్‌రావు, ముంజ రమేష్, మండల సంపత్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, అర్చకులు విష్ణువర్ధనాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను జయప్రదం చేయాలి


వరంగల్: మాట్లాడుతున్న నరేందర్

వరంగల్: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తైన సందర్భంగా నిర్వహించనున్న రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పిలుపునిచ్చారు. 19వ డివిజన్ డివిజన్ అధ్యక్షుడు చిలువేరు పవన్ అధ్యక్షతన శనివారం జరిగిన సన్నాహక సమావేశంలో మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి, నాయకులు గోరంటల మనోహర్, పుల్లా రమేష్, రాజు, రవి, చంద్రమౌళి, రాజ్‌కుమార్, జీకే సంపత్, నాసం హరీష్, కిరణ్‌నాయక్, కిశోర్ పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో తరలిరావాలి

న్యూశాయంపేట: ఈనెల 27న ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ సభకు కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని పార్టీ జిల్లా మైనార్టీ విభాగం బాధ్యుడు సయ్యద్ మసూద్ పిలుపునిచ్చారు. చింతల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి సంపదను దోచుకునేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, రమేష్, అంకూస్, అబ్బు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల ఎదుట ప్రధాని మోదీ ఫొటో పెట్టాలి

ఖిలా వరంగల్: రేషన్ బియ్యం పంపిణీలో సొమ్ము ఒకరిది, సోకొకరిదని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఎద్దేవాచేశారు. ప్రతీ రేషన్ షాపు ఎదుట ప్రధాని మోదీ ఫొటో విధిగా పెట్టాలని అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో వరంగల్ 34వ డివిజన్ పరిధిలోని రేషన్ షాపులో రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రవికుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌షాపుల్లో ఒక యూనిట్‌కు ఆరు కిలోల బియ్యానికి గాను కేంద్రం 5కిలోలు, రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక కిలో మాత్రమే ఇస్తోందని దుయ్యబట్టారు. ఈక్రమంలో రేషన్ షాపుల్లో నరేంద్రమోదీ చిత్రపటం ఉంచాలని సూచించారు.

ఆత్మవిశ్వాసంతో విజయం తథ్యం

హన్మకొండ: క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో విజయం సాధించవచ్చని గ్రూప్ –1 రాష్ట్ర 9వ ర్యాంకర్, మల్టీ జోన్ –1లో 3వ ర్యాంకర్ కుడికాల భవ్య అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని నిత్య బాంక్వెట్ హాల్‌లో షైన్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా భవ్య పాల్గొని మాట్లాడుతూ తాను షైన్ స్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించానని గుర్తుచేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. అనంతరం ఆమెను షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్, డైరెక్టర్లు మూగల రమ, జక్కుల శ్రీనివాస్ సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ప్రగతి రెడ్డి, సబిత, మానస, భవ్య కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.


కుడికాల భవ్యను సన్మానిస్తున్న చైర్మన్ మూగల కుమార్, డైరెక్టర్లు

గోల్డెన్ ఓక్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే


పట్టా ప్రదానం చేస్తున్న గంట రవికుమార్

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో గోల్డెన్ ఓక్ స్కూల్‌లో ప్రైమరీ చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్కూల్ చైర్మన్ గంట రవికుమార్ హాజరై వేడుకలను ప్రారంభించారు. గ్రాడ్యుయేషన్ పట్టాలను విద్యార్థులకు ప్రదానం చేశారు. చిన్నారులు ప్రత్యేక దుస్తుల్లో హాజరై ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన సీపీ



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని శనివారం వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ కుటుంబ సమేతంగా సందర్శించారు. రామలింగేశ్వరస్వామికి వారు పూజలు నిర్వహించగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్‌లు తీర్థప్రసాదాలు అందించి శాలువాతో సన్మానించారు. టూరిజం గైడ్ వెంకటేశ్ వారికి ఆలయ విశిష్టత గురించి వివరించగా రామప్ప శిల్పకళ సంపద బాగుందని కొనియాడారు. అనంతరం రామప్ప సరస్సును సందర్శించి బోటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఎస్సై సతీష్ పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



హన్మకొండ: వేసవిలో పోషకాలతో కూడిన ఆహారంతో పాటు ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా డీహైడ్రేషన్ బారిన పడకుండా శరీరాన్ని కాపాడుకోవచ్చని మిల్లెట్ హబ్ నిర్వాహకులు కుసుమ సురేష్, కవిత దంపతులు అన్నారు. హనుమకొండ ఎక్సైజ్ కాలనీ రైతుబజార్‌లో మహిళా వర్తకులు, వినియోగదారులకు 'పౌష్టికాహారం ప్రాముఖ్యత' అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జావా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిల్లెట్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్, రైతు బజార్ వ్యాపారులు పాల్గొన్నారు.

నేడు హిందూ విజయ యాత్ర


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నయీంనగర్: శ్రీరామనవమిని పురస్కరించుకొని హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం హిందూ విజయ యాత్ర (బైక్ ర్యాలీ)ను నిర్వహించనున్నట్లు హిందూ సేవా సమితి అధ్యక్షుడు నాగపురి వెంకటేష్ గౌడ్ తెలిపారు. కాజీపేట కడిపికొండ బ్రిడ్జి వద్ద సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై సుబేదారి హనుమకొండ చౌరస్తా మీదుగా పోచమ్మ మైదాన్ దుర్గేశ్వరాలయం వరకు సాగుతుందని అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ర్యాలీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్రీయ హిందూ సేన రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్, వెంకట్‌రెడ్డి, క్రాంతి, రానా యాదవ్, భరత్, నిఖిల్, రవి, నవీన్, సురేష్, రవి పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం


ముస్తాబైన వంగపహాడ్‌లోని రామాలయం


కాజీపేటలోని రైల్వే హనుమాన్ ఆలయం

ఖిలా వరంగల్: సీతారాముల కల్యాణోత్సవానికి వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి, రంగశాయిపేట రాములోరి గుడి, శంభునిపేటలోని విశ్వనాథ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయాలు ముస్తాబయ్యాయి. ఇప్పటికే కల్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, బాసింగం, జీలకర బెల్లం సిద్ధం చేశారు. ఉత్సవం రోజు కన్యాదానం, కల్యాణం, అభిషేకం, కలశ పూజ, గణపతి పూజ, మధుర్కపూజ, మాంగల్య ధారణ, తదితర ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి. సీతారామ చంద్ర స్వామి ఆలయంలో చలువ పందిర్లు, రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. శివనగర్ రామాలయంలో సుమారు 10వేల మంది భక్తులు వీక్షించేలా ఎల్ఈడీ స్కీన్లు ఏర్పాట్లు చేస్తున్నారు.

హసన్‌పర్తిలో ఏర్పాట్లు పూర్తి

హసన్‌పర్తి: శ్రీనవమి వేడుకలకు హసన్‌పర్తిలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఈమేరకు భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని రాజేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు, వంగపహాడ్‌లోని రామాలయం, చింతగట్టులోని రామాలయం, భీమారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, పలివేల్పులలోని రామాలయం, గోపాలపురంలోని మహాలక్ష్మి దేవాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు.

కాజీపేట రైల్వే ఆలయం ముస్తాబు

కాజీపేట రూరల్: కాజీపేటలో అతిపురాతన రైల్వే హనుమాన్ ఆలయ సముదాయంలో 89వ సీతారామ కల్యాణ వేడుకలకు అంతా సిద్ధం చేసినట్లు ఆలయ కమిటీ సెక్రటరీ పేపరు భాస్కర్‌రావు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి, రైల్వే స్కౌట్ అండ్ గైడ్స్ సహకారంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజా సమస్యలపై సీపీఎం పోరాటాలు

● పార్టీ నేత ఎం.చుక్కయ్య


సమావేశంలో మాట్లాడుతున్న చుక్కయ్య

కాజీపేట రూరల్: ప్రజా సమస్యలను అధ్యయనం చేసి, సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు, పోరాటాలకు సీపీఎం సిద్ధమవుతోందని పార్టీ నేత ఎం.చుక్కయ్య అన్నారు. ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు కాజీపేట మండలంలో ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. పార్టీ మండల కమిటీ సభ్యుడు తోట మల్లేష్ అధ్యక్షతన పార్టీ విస్తృతస్థాయి సమావేశం కాజీపేట దర్గా కనకదుర్గ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా చుక్కయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ప్రజల జీవన ప్రమాణాలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని విమర్శించారు. రాంపూర్ డంపింగ్ యార్డు సమస్య, కాజీపేట దర్గా రైల్వే బ్రిడ్జిలను తక్షణమే పూర్తిచేసేలా దీర్ఘకాలిక పోరాటానికి సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రాగుల రమేష్, బొట్ల చక్రపాణి, నాయకుడు ఉప్పెనపెల్లి నాగేశ్వర్‌రావు, కాజీపేట మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, మండల కమిటీ సభ్యులు జంపాల రమేష్, సంటి రవి, కారు ఉపేందర్, రామంచ సారంగపాణి, పోతరబోయిన సర్వయ్య, బద్రి, షర్ఫొద్దీన్, వెంకటేష్, అరూరి గణేష్, రాజమౌళి పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: దండకారణ్యంలో కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు, గంగుల దయాకర్ డిమాండ్ చేశారు. ఈనెల 8న హైదరాబాద్‌లో జరగనున్న ప్రజాధర్నా వాల్‌పోస్టర్లను హనుమకొండలోని కాళోజీ విగ్రహం వద్ద న్యూ డెమోక్రసీ, పీడీఎస్‌యూ నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరిట దండకారణ్యంలో ఆదివాసీ ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని సూచించారు. జల్, జంగిల్, జమీన్, ఇజ్జత్ హమరా హై అంటూ అడవిని, అడవిలోని సహజ, ఖనిజ సంపద, వనరులను కాపాడుకునేందుకు పోరాడుతున్న ఆదివాసీ సంఘాలను పాలకులు నిషేధించారని వాపోయారు. న్యూ డెమోక్రసీ నాయకుడు ఎలకంటి రాజేందర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, ఐఎఫ్‌టీయూ నగర కార్యదర్శి బన్న నర్సింగం, అనిల్, రాజేష్, శ్రీను, మురళి పాల్గొన్నారు.

మండలిలో ఉపాధ్యాయుల గొంతునవుతా


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

హసన్‌పర్తి: శాసన మండలిలో ఉపాధ్యాయుల గొంతుకై ఉంటానని టీచర్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఎన్నికైన శ్రీపాల్‌రెడ్డిని గోపాలపురంలో ఓ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఏ రాజకీయ పార్టీలో చేరేది లేదని తేల్చిచెప్పారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీపీఎస్ రద్దుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించేలా కృషి చేస్తానని చెప్పారు. తొలుత స్థానిక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పీఆర్టీయూ మాజీ అధ్యక్షుడు వీవీ.రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు మహేందర్ రెడ్డి, బిల్లా రఘునాథ్ రెడ్డి, శీలం ప్రకాష్‌బాబు, భాస్కర్‌రెడ్డి, కోమిడి మధుకర్ రెడ్డి, కృష్ణ, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.